ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
శుక్రవారం 18 ఏప్రిల్ 2025



ప్రభుత్వ ఆసుపత్రిలో అక్రమ వసూళ్లు

● సిటీ స్కాన్, 2డీ ఎకోకు డబ్బులు



సీటీ స్కాన్‌కు డబ్బులు చెల్లించేందుకు ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రోగులకు ఉచిత వైద్య సేవలు అందించాల్సిన ఖని ప్రభుత్వాసుత్రిలో సిటీ స్కాన్‌కు రూ.2వేలు, 2డీ ఎకోకు రూ.300 వసూలు చేస్తున్నారు. సూపరింటెండెంట్ పేరిట క్యూఆర్ కోడ్ స్కానింగ్ ఏర్పాటు చేశారు. ఆసుపత్రిలో ఉన్న సిటీ స్కాన్ చేసే సమయంలో కాంట్రాస్ట్ ఇంజెక్షన్ పేరిట స్కాన్‌కు వచ్చే ఒక్కొక్కరికి వద్ద రూ.2వేలను వసూలు చేస్తున్నారు. కాంట్రాస్ట్ ఇంజెక్షన్ ధర రూ.1400 ఉంటుంది. ఈ ఇంజెక్షన్ ముగ్గురికి సరిపోతుంది. కానీ ఒక్కొక్కరి వద్ద రూ.2వేలు వసూలు చేస్తున్నారు. కాంట్రాస్ట్ ఇంజెక్షన్ ప్రభుత్వం నుంచి సప్లై లేదంటూ సిటీ స్కాన్‌కు వచ్చే పేషెంట్ల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. అంతే కాకుండా 2డీ ఎకో పరీక్షలకు కూడా రూ.300 వసూలు చేస్తున్నారు. కౌంటర్ వద్ద డబ్బులు కట్టిన తరువాతనే పరీక్షలను నిర్వహిస్తున్నారు. అవుట్ పేషెంట్లకు రూ.300 ఎందుకు వసూలు చేస్తున్నారని ప్రశ్నిస్తే టెక్నీషియన్ బయట నుంచి వస్తున్నాడు, అతనికి డబ్బులు చెల్లించాలంటూ సమాధానం చెబుతున్నారు. ప్రైవేట్‌లో డబ్బులు చెల్లించలేక ప్రభుత్వాసుపతికి వస్తే ఇక్కడా డబ్బులు దోచుకుంటున్నారని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాల్లో ప్రతిపాదించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహన్ అన్నారు. గురువారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహన్ యాసంగి పంట ధాన్యం కొనుగోలుపై అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని, అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ ఓపీఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. రైస్‌మిల్లులకు ధాన్యాన్ని వెంటనే తరలించాలని, రవాణాకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని, రైస్‌మిల్లుల వద్ద ట్రక్ షీట్ త్వరగా జనరేట్ చేయాలన్నారు. ధాన్యం కేటాయించే రైస్‌మిల్లుల వద్ద నుంచి తప్పనిసరిగా బ్యాంకు గ్యారంటీలను స్వీకరించాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను సంబంధిత రైస్ మిల్లులకు పక్కాగా ట్యాగ్ చేయాలన్నారు. పంట కోతల సమయంలో హార్వెస్టర్ 8 నుంచి 20 ఆర్‌పీఎం మెయింటెయిన్ చేయాలన్నారు. అదనపు కలెక్టర్ వేణు, డీఎస్‌ఓ రాజేందర్, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

మొదలైన రేషన్‌కార్డుల సర్వే



● పరిశీలనకు ప్రత్యేక యాప్ రూపొందించిన ప్రభుత్వం
● కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బందిచే గ్రామసభల దరఖాస్తుల పరిశీలన
● రెవెన్యూ సిబ్బందిచే మీసేవా దరఖాస్తుల పరిశీలన
● తుది పరిశీలన 360 డిగ్రీస్ యాప్ ద్వారా..

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

కొత్త రేషన్ కార్డుల జారీ కోసం క్షేత్రస్థాయిలో సర్వే మొదలు పెట్టారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులతో పాటు గ్రామ, పట్టణ సభలు, మీసేవా కేంద్రాల ద్వారా రేషన్ కార్డుల కోసం చేసుకున్న దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలన ప్రారంభమయ్యింది. ఇందు కోసం ప్రత్యేకించి ప్రభుత్వం ఒక యాప్‌ను రూపొందించింది. ఆ యాప్‌లో రేషన్ కార్డుదారుల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను నమోదు చేస్తు న్నారు. దరఖాస్తు చేసుకున్న నంబర్, ఇంటి నంబర్, రేషన్ డీలర్ నంబర్, దరఖాసు_దారుడి పేరుతోపాటు ఆ కుటుంబంలో గల కుటుంబ సభ్యుల పేర్లు, వయసు, ఆధార్ నంబర్లు, సామాజిక వర్గం, వంట గ్యాస్ వివరాలు, ఏజెన్సీ పేరు, తదితర వివరాలను నమోదు చేస్తున్నారు. దరఖాస్తుదారుడు అర్హుడా, కాదా అనే ఆప్షన్ కూడా ఇచ్చారు. రెండు రోజుల నుంచి గ్రామాల్లో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, పట్టణాల్లో మున్సిపల్ సిబ్బంది దరఖాస్తుల పరిశీలన చేస్తూ అర్హులను గుర్తిస్తున్నారు.



పెద్దకల్వల గ్రామంలో యాప్‌లో కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు నమోదు చేస్తున్న పంచాయతీ కార్యదర్శి

జిల్లాలో ప్రస్తుతం 2,07,280 ఆహార భద్రత కార్డులు ఉండగా వీటిలో 5,97,071 మంది లబ్ధిదారులు ఉన్నారు. 12,269 అంత్యోదయ కార్డులు ఉండగా వీటిలో 33,776 మంది లబ్ధిదారులు, 155 అన్నపూర్ణ కార్డుల్లో 163 మంది ఉన్నారు. మొత్తం 2,19,712 కార్డులు ఉన్నాయి. వీటి ద్వారా ప్రతీ నెలా 4,013 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నారు. ఈ నెల నుంచి దొడ్డు బియ్యానికి బదులు సన్న బియ్యం పంపిణీ చేస్తుండడంతో రేషన్ కార్డులకు డిమాండ్ ఏర్పడింది. రేషన్ కార్డులు ఉన్న వారిలో సగానికి పైగా లబ్ధి దారులు దొడ్డు బియ్యాన్ని కిలోకు 10 నుంచి 12 రూపాయలకు అమ్ముకోగా, సన్న బియ్యం మాత్రం తీసుకవెళుతున్నారు. దీంతో తమ కు ఎప్పుడు కొత్త రేషన్ కార్డులు ఇస్తారా అని అర్హులైన వారు ఎదురు చూస్తున్నారు.

36,514 దరఖాస్తుల రాక..

కొత్త రేషన్ కార్డుల కోసం పట్టణ, గ్రామ సభలు, మీ సేవా కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు మొత్తం 36,514 మంది దరఖాస్తు చేసుకు న్నారు. గ్రామసభల ద్వారా వచ్చిన 32,174 దర ఖాస్తుల వివరాలను ఎంపీడీవో కార్యాలయాల్లో ఉండే ప్రజా పాలన సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేశారు. ఇందులో అర్హులను గుర్తించేందుకు ప్రభుత్వం ప్రత్యేక యాప్ రూపొందించింది. ఆ యాప్ ద్వారా క్షేత్ర స్థాయి లో గ్రామ పంచా యతీ సిబ్బంది ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తున్నారు. అలాగే మీ సేవా ద్వారా 4,340 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులు తహసీల్దార్ లాగిన్‌కు వెళుతున్నాయి.

అక్కడ తహసీల్దార్ అర్హులను గుర్తించేందుకు గిర్దావర్లకు బాధ్యతను అప్పగించగా, వారు విచారణ జరిపి అర్హులా కాదా అని తేల్చి తహసీల్దార్లకు రిపోర్టు చేస్తున్నారు.

మిగతా 8వ పేజీలో

భూ భారతి చట్టంపై విస్తృత ప్రచారం చేయాలి



ప్రసంగిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

జ్యోతినగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టంపై రైతులు, ప్రజలలో విస్తృత ప్రచారం చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. గురువారం ఎన్టీపీసీ ఈడీసీ మిలీనియం హాలులో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. భూ భారతి చట్టంలోని వివిధ అంశాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. భూ భారతి(రికార్డ్ ఆఫ్ రైట్స్ ఇన్ ల్యాండ్) చట్టం 2025 పై రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈనెల 28 వరకు సదస్సులు నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. అధికారులు అందించిన ఆర్డర్లపై భూ భారతి చట్టం ప్రకారం అప్పీలు చేసుకునే అవకాశముందని, రెవెన్యూ అధికారి నిర్ణయంపై కలెక్టర్, కలెక్టర్ నిర్ణయంపై ట్రిబ్యునల్ వద్ద అప్పీలు చేసుకోవచ్చన్నారు. గతంలో ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు ఏదైనా అభ్యంతరాలు ఉంటే సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సి ఉండేదని, ప్రస్తుతం ఆ అవసరం లేకుండా అప్పీల్‌కు అవకాశం కల్పించారన్నారు. సివిల్ కోర్టుకు వెళ్లవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తుదారులకు అవసరమైన ఉచిత న్యాయ సలహాను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ప్రతీ గ్రామంలో గ్రామ పరిపాలనా అధికారిని నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఆధార్ కార్డు లాగానే భూమికి భూధార్ సంఖ్యను కేటాయిస్తారని, దీంతో భూ ఆక్రమణలకు చెక్ పడుతుందన్నారు. కొత్త చట్టంపై అ వగాహన కల్పించడంలో భాగంగా కరపత్రాలు పంపిణీ చేశామని, ఏదైనా సమస్యలుంటే అధికారులు సిద్ధంగా ఉంటారని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం ధరణిలో ఉన్న రికార్డులు భూ భారతిలో కొనసాగుతాయన్నారు. సమావేశంలో రెవెన్యూ డివిజన్ అధికారి గంగయ్య, రామగుండం తహసీల్దార్ ఈశ్వర్, ప్రజలు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్ పర్యటన

జ్యోతినగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : కార్పొరేషన్ 5వ డివిజన్‌లో గురువారం అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి కమీషనర్ జె.అరుణశ్రీ పర్యటించారు. మల్కాపూర్ రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు, కాలువను, కమిషనరేట్ సమీపంలో ఉన్న కాలువలను ఎరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

పకడ్బందీగా ఎల్‌ఆర్‌ఎస్ అమలు చేయాలి

పెద్దపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పకడ్బందీగా ఎల్‌ఆర్‌ఎస్ అమలు చేయాలని రాష్ట్ర పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్ అన్నారు. గురువారం హైదరాబాద్ నుంచి కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. ఈనెల 30 వరకు ఎల్‌ఆర్‌ఎస్ రుసుం చెల్లిస్తే 25 శాతం రాయితీ లభిస్తుందని, ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను జిల్లాలో వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. లేఔట్‌లకు సంబంధించి భూ క్రమబద్ధీకరణ మంజూరు పత్రాలు సైతం ఫీజు చెల్లిస్తే జారీ చేయాలని అన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు వసూలుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ఫీజు చెల్లించిన దరఖాస్తుల క్రమబద్ధీకరణ ప్రొసీడింగ్స్‌ను సత్వరమే జారీ చేయాలన్నారు. డీపీఓ వీర బుచ్చయ్య, మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్, సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్ నియజ్, పెద్దపల్లి మున్సిపాలిటీ అసిస్టెంట్ ఇంజనీర్ సతీష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పంటలకు సరిపడా నీరందించాం

సుల్తానాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పంటలను కాపాడేందుకు పూర్తి స్థాయిలో సాగు నీటిని అందించామని, గుంట భూమిని కూడా ఎండిపోకుండా చర్యలు తీసుకున్నామని ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. చిన్నకలువల సహకార సంఘం పరిధిలోని దేవునిపల్లి, కొదురుపాక, నారాయణపూర్, చిన్నకలువల గ్రామాలలో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం చిన్న కలువలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతు ఈ సీజన్‌లో రైతులు పెద్ద ఎత్తున వరి పండించారని, పంటలకు సరిపడే విధంగా సాగునీటిని అందించామని అన్నారు. నియోజకవర్గంలో నీరందించే శ్రీరాం సాగర్ ప్రాజెక్టు కాలువను పరిరక్షించుకోవడం రైతుల కర్తవ్యమని, వాటిని ధ్వంసం చేయడం, కాలువ నీటిని అడ్డుకోవడం, చెత్త వేయడం, కింది రైతులకు నీరందకుండా చేసే వారిని ఉపేక్షించేది లేదని, వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రధాన కాలువల పూడిక తీత పనులు చేపడతామన్నారు. ధాన్యం విషయంలో రైతులు ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ కేంద్రాలకు తీసుకురావాలని,



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

కొనుగోలు చేసిన రెండు రోజుల్లో డబ్బులు ఖాతాల్లో జమ చేస్తామన్నారు. ఎలాంటి కటింగ్‌లు లేకుండా వడ్లు కొనుగోలు చేయడంలో రాష్ట్రంలోనే పెద్దపల్లికి గుర్తింపు వచ్చిందని, ఈసారి కూడా సన్న వడ్లకు క్వింటాలుకు ఐదు వందల బోనస్ ఇస్తామన్నారు. కేడీసీసీబీ డైరెక్టర్ మోహన్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రకాశ్‌రావు, రాములు, సాయిరి మహేందర్, సతీష్, లింగయ్య, సాగర్‌రావు, సుగుణాకర్ రావు, మాధవరావు, పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే

ఓదెల, (ఆంధ్రజ్యోతి): మండంలోని ఇందుర్తి, శానగొండలో వడగం డ్ల వాన, గాలి దుమారానికి దెబ్బతిన్న పంటలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఎనిమిది గ్రామాల్లో పంట దెబ్బ తిన్నదని సర్వే నిర్వహించి పంట సాయం అందే విధంగా కృషి చేస్తానని అన్నారు.

పొత్కపల్లి, మడక, కనగర్తి, గుండ్లపల్లి, పిట్టల ఎల్లయ్య పల్లి గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే విజయరమణారావు ప్రారంభించారు. పార్టీ మండల అధ్యక్షుడు ప్రేమ్‌సాగర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ సుమ న్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మహేందర్, సీతఓ అంజిరెడ్డి, పాల్గొన్నారు.



ఇందుర్తిలో పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

సోనియా, రాహుల్‌పై అక్రమ కేసులు పెట్టిన బీజేపీ



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ, రాహుల్ గాంధీలపై బీజేపీ ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించడాన్ని నిరసిస్తూ గురువారం గోదావరిఖని చౌరస్తాలో కాంగ్రెస్ శ్రేణులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొంతల రాజేష్ హాజరై మాట్లాడారు. నేషనల్ హెరాల్డ్ పత్రిక కేసులో ఈడీ సోనియా, రాహుల్‌గాంధీ పేర్లను చేర్చడం దారుణమన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టిన తరువాత కాంగ్రెస్ నాయకులపై ఈడీ దాడులు కొనసాగుతున్నాయని, బీజేపీ నిజస్వరూపాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. సామాజిక దృక్పథంతో జవహర్‌లాల్‌నెహ్రూ పత్రికను స్థాపించారని, ఆర్థిక ఇబ్బందులతో పత్రికను మూసివేసినప్పటికి ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్‌షాలు సోనియా, రాహుల్‌లపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బీజేపీ కక్ష సాధింపు చర్యలు మానుకోకపోతే దేశ వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులు కాల్వ లింగస్వామి, మాదరబోయిన రవికుమార్, సుజాత, మల్లయ్య, ముస్తాఫా, పెద్దెల్లి తేజస్విని ప్రకాష్, దీటి బాలరాజు, పాతపెల్లి ఎల్లయ్య, జాలి రాజమణి, పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు, లారీ ఢీ

● 23 మందికి గాయాలు ● పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స
● డ్రైవర్ సెల్‌ఫోన్ మాట్లాడమే ప్రమాదానికి కారణమని ఆరోపణ
● క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే, ఏసీపీ

6



ఆసుపత్రిలో ఉన్న క్షతగాత్రులు

వృద్ధులకు అండగా...

● లయన్స్ క్లబ్ విజన్ కేర్ ద్వారా ఉచిత కంటి ఆపరేషన్లు

6

జోరుగా బెల్టు షాపుల దందా

● అధిక రేట్లతో విక్రయాలు ● 'మామూలు'గానే చూస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు



బెల్టు షాపుల్లో విక్రయిస్తున్న మద్యం (ఫైల్)

మంథని, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఊరురా.. వాడ అనే తేడా లేకుండా జోరుగా మద్యం విక్రయాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. మంథని పట్టణంలోని వార్డుల్లో, మండలంలోని అన్ని గ్రామాల్లో రాత్రీ పగలు తేడా లేకుండా విచ్చలవిడిగా బెల్టుషాపులు నిర్వహిస్తున్నారు. మద్యం వ్యాపారుల కనుసన్నల్లో బెల్టు షాపుల దందా మూడు క్వార్టర్లు, ఆరు బీరులుగా నడుస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నేరుగా షాపుల నుంచి ఆటోలు, ట్రాలీలు, టూవిలర్స్ ద్వారా రోజు పెద్ద ఎత్తున వివిధ బ్రాండ్ల మద్యం, బీరు బాటిళ్ల కాటన్లలను గ్రామాల్లోని బెల్ట్‌షాపులకు తరస్తున్నారు. వారు అక్కడ అధిక రేట్లకు మద్యం విక్రయిస్తూ అందిన కాడికి దోచుకుంటున్నారు. బెల్ట్‌షాపుల్లో అధిక ధరలకు మద్యం విక్రయాల కారణంగా మద్యం ప్రియులు జేబులకు తూట్లు పడుతున్నాయి. మంథని పట్టణం తోపాటు గ్రామాల్లో చిన్నచితక పనులు చేసుకునే కూలీలు వారు తమ సంపాదనను మద్యానికే ఖర్చు చేస్తున్నారు. మంథనిలోని శ్రీపాదచౌక్, జ్యోతిబాఫూలే చౌక్, పాత పెట్రోల్‌పంపు, హనుమాన్‌నగర్ శ్రీపాదకాలనీ, పోచమ్మవాడ, మజీదు వాడలోని ప్రధాన రహదారి పక్క షాపులు, ఇండ్లలో, మున్సిపల్ పరిధిలోని బోయినిపేట, గంగాపురి పలు వార్డుల్లో, గ్రామాల్లోని వివిధ వాడల్లో ప్రతీ ఏరియాలో 3 నుంచి 5 వరకు బెల్ట్‌షాపులు కొనసాగుతున్నాయి. చాలా వరకు ఇవి కిరాణ, కూల్‌డ్రింక్, ఇతర చిన్న షాపుల పేరిట నివాస మధ్యనే 24 గంటలపాటు మద్యం విక్రయిస్తున్నారు. దీంతో గ్రామాల్లో, పట్టణంలో చాలా మంది విద్యార్థులు, యువత మద్యానికి బానిసవుతున్నారు. మద్యం కారణంగా గొడవలు, అకారణంగా ఇతరులను దూషించడం, మద్యం మత్తులో నానా హంగామా సృష్టిస్తున్నారు. గ్రామాల్లో, మంథని పట్టణంలో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు అధిక ధరలకు కొనసాగుతున్న, మద్యం మత్తులో వివిధ రకాల గొడవలు జరుతున్న ఇటు ఎక్సైజ్, ఆటు పోలీసు శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. వీటిని వారు మాములుగానే చూస్తున్నట్లు బహిరంగానే ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్, పోలీసు శాఖల అధికారులు స్పందించి విచ్చలవిడి బెల్టు షాపుల నిర్వహణ, అధిక ధరలకు మద్యం విక్రయాలకు కళ్ళెం వేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఆటోలో బెల్టు షాపులకు తరలిస్తున్న మద్యం కాటన్‌లు

ఘర్షణకు దారితీసిన క్రికెట్ ఆట

● మాజీ కౌన్సిలర్‌తోపాటు కుమారుడిపై కేసు

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ ఆట రెండు కుటుంబాల మధ్య ఘర్షణకు దారితీసిన సంఘటన సిరిసిల్లలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలోని గాంధీనగర్‌లో ఇటీవల సెలవులు రావడంతో బాలలంతా కలిసి క్రికెట్ ఆడేందుకు క్రీడామైదానానికి వెళ్లారు. ఇందులో భాగంగా ఇరుజట్లు మైదానంలోకి క్రికెట్ ఆడేందుకు దిగాయి. ఇరువైపుల జట్ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో భవన్ అనే బాలుడు రెండుసార్లు అవుట్ అయ్యాడు. దీంతో నన్నే అవుట్‌చేస్తావా, మా నాన్న రెండుసార్లు కౌన్సిలర్.. అంటూ ఆగ్రహంతో క్యాచ్‌పట్టిన భార్గవ్ అనే బాలుడిని బ్యాట్‌తో కొట్టాడు. దీంతో రెండు కుటుంబాల మధ్య వివాదానికి తెరలేపింది. క్రికెట్‌లో అవుట్ చేసిన బాలుడిపై దాడిచేయడంతో అతని స్నేహితులు వెంటనే అతని ఇంటికి వెళ్లి తల్లికి చెప్పారు. ఎందుకు కొట్టావంటూ బాలుడిని అడిగేందుకు వెళ్లిన తల్లిపై మాజీకౌన్సిలర్ దౌర్జన్యం చేయడమే కాకుండా దుర్భాషలా డారు. దీంతో బాధితురాలు అన్నల్‌దాస్ ఉష పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యా దు చేసింది. ఈమేరకు మాజీకౌన్సిలర్ గుండ్లపల్లి పూర్ణచందర్, అతడి కుమారుడు భవన్‌పై అదేరోజు కేసు నమోదుచేశామని టౌన్ సీఐ కె కృష్ణ గురువారం తెలిపారు. ఇదిలా ఉంటే తమకు మాజీకౌన్సిలర్, అతని అనుచరులతో ప్రాణభయం ఉందని, ద్విచక్రవాహనాలతో తమ ఇంటిచుట్టూ చక్కర్లు కొడుతూ భయభ్రాంతులకు గురిచేస్తు న్నారని, తమకు రక్షణ కల్పించాలని బాలుడితల్లి ఉష వేడుకుంటున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

అట్రాసిటి కేసుపై డీఎస్పీ విచారణ

మల్యాల, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసుపై మండలంలోని ముత్యంపేటలో డీఎస్పీ రఘుచందర్ విచారణ జరిపారు. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట్‌కు చెందిన తిప్పని కార్తిక్ అనే యువకుడు ముత్యంపేటకు చెందిన ఓ యువతిని ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేస్తూ మంగళవారం యువతి ఇంటికి వచ్చి కులం పేరుతో దూషించాడు. దీంతో పోలీసులు బుధవారం యువకుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేశారు. గురువారం డీఎస్పీ విచారణ జరిపి వివరాలు నమోదు చేసుకున్నారు. డీఎస్పీ వెంట ఎస్సై నరేశ్‌కుమార్ ఉన్నారు.

భక్తులతో అమర్యాదగా ప్రవర్తించడం సరికాదు

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయం అధ్యక్షుడిగా తనకు తాను ప్రకటించుకున్న కార్యదర్శి సిరిమల్ల జయేందర్ భక్తులు, గురుస్వాములపట్ల అమర్యాదగా ప్రవర్తించడం సరికాదని భక్తులు గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. లక్షలాది రూపాయలు చందాలు ఇచ్చిన భక్తులకు ఆలయంలో జరిగే ఉత్సవాలకు ఆహ్వానించకపోవడం బాధాకరం అన్నారు. ప్రశ్నించిన వారిని ఏదో విధంగా అవమానపరుస్తూ ఆలయానికి రాకుండా చేస్తున్నారని అయిత విజయ్‌కుమార్, గందె రాజు, యాద సతీష్, తదితరులు తెలిపారు.

వృద్ధులకు అండగా..

లయన్స్ క్లబ్ విజన్ కేర్ ఉచిత సేవలు

అవగాహన కల్పించి కంటి చికిత్సలు

10374 మందికి ఆపరేషన్లు, 63743 మందికి అద్దాలు

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కంటి చూపు లోపంతో కొట్టుమిట్టాడుతున్న వృద్ధులకు మేమున్నామని అండగా నిలుస్తోంది లయన్స్ క్లబ్ విజన్ కేర్. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లా కు చెందిన 23 మంది నేత్రవైద్య సహాయకులు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన మొదటి విడుతలో తెలంగాణ కంటి వెలుగులో పని చేశారు. కంటి వెలుగు పథకం లేకపోవడంతో బాధితుల నుంచి నేత్ర వైద్య సహాయకులకు పెద్ద ఎత్తున వినతులు వచ్చాయి. వీరికి కంటి చూపు కల్పించాలన్న భావన వారిలో వ్యక్తమైంది. నేత్ర వైద్య సహాయకులు వారిలో కంటిలో వెలుగులు నింపాలనే ఉద్దేశంతో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ 320జీ వారిని సంప్రదించి పరిస్థితిని వివరించారు. వారు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

2021లో పూదరి దత్తాగౌడ్ నేతృత్వంలో లయన్స్ క్లబ్ విజన్ కేర్ స్థాపించారు.



కంటి ఆపరేషన్‌కు వెళ్తున్న బాధితులు

వ్యవస్థాపక అధ్యక్షుడిగా దత్తాగౌడ్ లాభాపేక్ష లేకుండా అడుగులు ముందుకు వేశారు. వచ్చిన వినతులను పరిశీలించి ఆయా గ్రామాలకు వెళ్ళి కంటి చికిత్సలు చేయించడం మొదలుపెట్టారు. లయన్స్ క్లబ్ సభ్యులు గ్రామాల్లో తిరుగుతూ కంటి చికిత్సలపై విసృత స్థాయిలో అవగా హన కల్పించి చికిత్సలు చేయించుకు నేందుకు ప్రోత్స హించారు. గ్రామాలతో పాటు పట్టణాల్లో ఉచితవైద్య శిబిరాలు నిర్వహించారు. ఇప్పటి వరకు 2లక్షల13 వేల 567 మందికి పరీక్షలు చేయించారు.



సుమారు 10 వేల 374 మందికి కంటి ఆపరేషన్లు చేయించారు. అద్దాలు, మందులు అందేలా చర్యలు తీసుకున్నారు. కంటి శస్త్ర చికిత్స అందించే వారితో పాటు వచ్చే సహా యకులకు ఉచిత రవాణా, భోజన వస తులు కల్పించారు. లయన్స్ కంటి ఆసుపత్రి రేకుర్తి, చల్మెడ ఆనంద రావు ఆసుపత్రి, బెల్లంపల్లి పుష్పగిరి కంటి ఆసుపత్రిల సహకా రంతో ఉచిత కంటి శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహిం చారు. ఈ ఆపరేషన్లకు డిస్ట్రిక్ట్ బ్లైండ్నెస్ కంట్రోల్ సొసైటీ ద్వారా ఒక్కో ఆపరేషన్‌కు 2 వేల రూపాయలు చెల్లిస్తోంది. ఈ డబ్బులు రవాణా, భోజన సౌకర్యాల ఖర్చులకు సరిపో తుంది. ఒక్క ఆపరేషన్ బయట చేయించుకోవాలంటే సుమారు 20 వేల రూపాయలు ఖర్చు అవుతుందని వారు పేర్కొంటున్నారు. దాతల సహకారంతో 63 వేల 743 మందికి అద్దాలు అందజేశారు. ప్రభుత్వం మమ్మల్ని గుర్తించి అవుట్ సోర్సింగ్ లేదా రెగ్యులర్ అసిస్టెంట్ అప్తామాలిక్ పోస్టులుగా గుర్తించి ఉపాధి కల్పిస్తే మరింత సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని వారు పేర్కొంటున్నారు.

లయన్ సభ్యులు పూదరి దత్తాగౌడ్, అలీ అహ్మద్, పెర్క పృథ్వి రాజ్, సయ్యద్ ఇలియాస్ పరకాల, దామ లావణ్య, ముబీన్, బొగే సాయి నిఖిల్, అబ్దుల్ వాసే, బోడ రమేష్, షాకీర్, ఆసిమ్, బుద్దార్తి సతీష్ కుమార్, ఆకుల మల్లేష్, మాదర్‌ఖాన్, అలీం లయన్స్ క్లబ్ విజన్ సెంటర్ల ద్వారా ఉచితంగా పరీక్షలు చేసి దాతల సహాయంతో ఆపరేషన్లు చేస్తూ అద్దాలు, మందులు అందజేస్తున్నారు.

పేద ప్రజలకు కంటివైద్యం అందించడమే లక్ష్యం

పూదరిదత్తాగౌడ్, లయన్ విజన్ కేర్ వ్యవస్థాపక అధ్యక్షుడు



నిరుపేద ప్రజలకు కంటి వైద్యం అందించడమే లక్ష్యంగా లయన్ విజన్ కేర్ పని చేస్తుంది. ఇప్పటికి వరకు లక్షలాది మందికి పరీక్షలు చేసి వేల మందికి ఆపరేషన్లు చేసి అద్దాలు అందజేశాం.

5వేలకు పైగా ఆపరేషన్లు

చిదుర రమేష్, రేకుర్తి కంటి ఆస్పత్రి వైస్ చైర్మన్



రేకుర్తి ఆస్పత్రిలో లయన్ విజన్ కేర్ ద్వారా 5 వేల మందికి పైగా ఆపరేషన్లు చేశాం. ప్రభుత్వం రోగు లకు ఇస్తున్న రెండువేల రూపా యలతో రవాణా, భోజన సౌకర్యం కల్పించాం. నెల రోజులకు సరిపడా మందులు అందజేశాం.

పైసా ఖర్చు లేకుండా ఆపరేషన్ చేశారు

భూదమ్మ మంథని



పైసా ఖర్చు లేకుండా బస్సులో తీసుకెళ్ళి పరీక్షలు చేసి ఆపరేషన్ చేసి అద్దాలు, మందులు ఇచ్చారు. ఇప్పుడు కండ్లు మస్క లేకుండా కనిపిస్తున్నాయి,

ఆర్టీసీ బస్సు, లారీ ఢీ

● 23 మందికి గాయాలు

● డ్రైవర్ ఫోన్ మాట్లాడమే ప్రమాదానికి కారణం

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మండలం అప్పన్నపేట, అందుగులపల్లి మధ్య కరీంనగర్ నుంచి గోదావరిఖనికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న లారీని గురువారం సాయంత్రం ఢీకొంది. పెద్దపల్లి మండలం అప్పన్నపేట అందుగులపల్లి మధ్యలో రోడ్డు మరమ్మతు పనులు జరుగుతున్నాయి. దీంతో ట్రాఫిక్‌ను వన్‌వేకు మళ్ళించారు. కరీంనగర్ నుంచి గోదావరిఖనికి వెళ్తున్న పల్లె వెలుగు టీఎస్ 02 యూబీ 9326, కరీంనగర్ వైపు వెళ్తున్న బూడిద లారీ టీఎస్ 22 0450 ఎదురెదురుగా ఢీకొన్నాయి. బస్సులో సుమారు 32మంది ప్రయాణికులున్నారు. ఈ సంఘటనలో 27మందికి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే పోలీసులకు, అంబులెన్స్‌కు సమాచారం అందించారు. 108లో పెద్దపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కండక్టర్ శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలు కాగా కరీంనగర్ ఆస్పత్రి తరలించినట్లు తెలిసింది. అయితే డ్రైవర్‌నాగేందర్ సెల్‌ఫోన్ మాట్లాడుతూ బస్సు నడపడం వల్లే ఈప్రమాదం జరిగిందని ప్రయాణికులు పేర్కొంటున్నారు. ఆస్పత్రిఆవరణ క్షతగాత్రులతో నిండి పోయింది. గాయాలైన వారిలో ఎర్రగొండ పావని, కీర్తన, ఎర్రగొండ ప్రేమలత, కోండ్రరాధ, అగపెలిసా, చిరంజీవి, ఎనవాక మహాలక్ష్మీ, తన్వీశ్రీ, మోక్షశ్రీ, శారద, సహస్ర, కొయ్యడ సంపత్, కొయ్యడ రజిత, కీర్తన, సౌజన్య, శోభ, వొల్లెపురాజమ్మ, అనిల్‌కుమార్, కాంపెల్లి సుజాత, మడుపు అనిత, సరిత, మోక్షిత్, వైష్ణవి, దీపిక, మనోజ్, ఎరుకల శోభ,ఆశానె,సృజన ఉన్నారు.ప్రమాదం జరిగినవెంటనే ఏసీపీ గజ్జికృష్ణ, ఎస్సైలు సీఐ, సిబ్బందిని పంపించి సహాయక చర్యలు చేపట్టారు.



ఎదురెదురుగా ఢీకొన్న బస్సు, లారీ



గాయపడ్డ వారిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

● క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే

గాయపడిన వారిని ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ప్రభుత్వాస్పత్రిలో పరామర్శించారు. ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంపై విచారం వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల కారణాలను విచారణ చేపట్టాలని పోలీసులను ఆదేశించారు. గాయ పడిన వారికి వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ఆర్‌ఎం భూపతిరెడ్డి, గోదా వరిఖని డీఎం నాగభూషణం పరామర్శించారు.

ఉరివేసుకొని వివాహిత ఆత్మహత్య



శ్యామల (ఫైల్)

మానకొండూర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగిపల్లి గ్రామానికి చెందిన మార శ్యామల(38) అనే వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు ఇలా ఉన్నాయి.. గంగిపల్లికి చెందిన యాదగిరితో 26ఏళ్ళ క్రితం శ్యామల వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె జన్మించగా కుమార్తెకు ఇటీవల అప్పుచేసి వివాహం జరిపించారు. తన భర్త యాదగిరి దుబాయి వెళ్లగా కొంతకాలంగా శ్యామల అనారోగ్యంతో బాధపడుతోంది. పలు ఆసుపత్రులలో చూపించిన నయం కాలేదు. జీవితంపై విరక్తి చెందిన ఆమె బుధవారం రాత్రి ఇంటిలో చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం తెలుసుకున్న భర్త యాదగిరి గురువారం స్వగ్రామానికి చేరుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. శవపంచనామా నిర్వహించిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

కోరుట్ల ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఒకరి మృతి

కోరుట్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పోందుతూ మల్లాపూర్ మండలం కుస్తాపూర్ గ్రామానికి చెందిన నీరేటి ముత్తయ్య (60) అనే వ్యక్తి మృతి చెందాడు. ముత్తన్న కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి డయాలసిస్ చేసుకోవడానికి గురువారం మధ్యాహ్నం వచ్చాడు. చికిత్స నిర్వహిస్తున్న సమయంలో ముత్తయ్య మృతి చెందాడు. ముత్తన్న మృతికి వైద్యులు కారణమంటూ మృతుడి బంధువులు నిలదీసారు. ముత్తన్న మృతిపై అనూమానం ఉందని ఆందోళనచేసేందుకు సిద్దంమయ్యారు. గమనించిన స్థానికులు కోరుట్ల పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలంకు చేరుకోన్న ఎస్ఐ శ్రీకాంత్ మృత్తన్న కుటుంబసభ్యులు, బంధువులను సముదాయించారు. ఫిర్యాదు ఇస్తే కేసు నమోదు చేసి పోస్టుమార్టం చేయించి రిపోర్ట్ ఆదారంగా ఆసుపత్రి వర్గాలపై కేసునమోదు చేస్తామని తెలిపారు. కాగా ముత్తయ్య కుస్తాపూర్ గ్రామం నుంచి మధ్యాహం ద్విచక్ర వాహనంపై ఎండలో వచ్చాడని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ముత్తయ్య ఎండ వేడికి మృతి చెందాడో... లేక మరే ఇతర కారణంతో మృతి చెందాడన్న కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్స్



జమ్మికుంటకు వెళ్లే మూలమలుపు వద్ద ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

మానకొండూర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలోని రెండు మూలమలుపులు, రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లతో ప్రమాదం పొంచి ఉంది. తూర్పుదర్వాజ బస్టాండ్ మూలమలుపు వద్ద 20ఏళ్ల క్రితం అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. కరీంనగర్ నుంచి జమ్మికుంట ప్రధానరహదారి మానకొండూర్ తూర్పుదర్వాజ బస్టాండ్ మీదుగా ఆర్టీసీ బస్సులు, లారీలు, ఇతర వాహనాలు నిత్యం వెళుతుంటాయి. కరీంనగర్ నుంచి జమ్మికుంట వైపు తిరిగే మూలమలుపు వద్ద గతంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. డ్రైవర్ ఆదమరిస్తే ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొనాల్సిందే. జమ్మికుంట వైపు వెళ్లే ప్రయాణికులు నిలబడడానికి అక్కడ స్థలమే లేదు. ప్రయాణికులు వేరే స్థలంలో ఉండి బస్సు వచ్చే సమయంలో పరుగులు తీసి ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో ఇక్కడ అనేకప్రమాదాలు జరిగి పలువురు మృత్యువాతపడ్డారు. ప్రస్తుతం ఇదే బస్టాండ్‌వద్ద జమ్మికుంట నుంచి కరీంనగర్ వెళ్లే మూలమలుపు వద్ద విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు గద్దెను నిర్మిస్తున్నారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంపై గ్రామస్థులు, ప్రయాణికులు వ్యతిరేకిస్తున్నారు. అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ గద్దె నిర్మాణం చేపట్టవద్దని గ్రామస్థులు, ప్రయాణికులు కోరుతున్నారు. ఈ విషయమై మానకొండూర్ విద్యుత్ ఏఈ ఆర్ సత్యనారాయణను వివరణ కోరగా పాతట్రాన్స్‌ఫార్మర్‌పై లోడు పడుతోందని స్థలం లేకపోవడంతోనే మూలమలుపు వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

బీఆర్‌ఎస్ నాయకులను అడ్డుకున్న పోలీసులు



వెంకటాపూర్ వద్ద బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కృష్ణహరి, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డిని అడ్డుకుంటున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేటలో పోలీసులు అక్రమ అరెస్ట్ చేసిన నాయకులకు సంఘీభావం తెలపడం కోసం వెళుతున్న ఎల్లారెడ్డిపేట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కృష్ణహరి, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డిలను మండలంలోని వెంకటాపూర్ గ్రామ శివారులో గురువారం పోలీసులు అడ్డుకున్నారు. గంభీరావుపేటలో నెలకొన్న ప్రోటోకాల్ వివాదంలో బీఆర్‌ఎస్ నాయకులను కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారని పేర్కొంటూ అక్కడి పోలీసులు బీఆర్‌ఎస్ నాయకులను అదుపులోకి తీసుకున్నారనే సమాచారంతో బయలుదేరి వెళ్లారు. దాంతో వెంకటాపూర్ గ్రామ శివారులో నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. తమ నాయకులకు సంఘీభావం తెలిపేందుకు బయలుదేరితే పోలీసులు అడ్డుకోవడం అన్యాయమని నాయకులు కృష్ణహరి, కృష్ణారెడ్డిలు పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఫ్లెక్సీ వివాదం

● ప్రారంభోత్సవ సమయంలో తోపులాట ● పోలీస్ స్టేషన్‌లో పరస్పర ఫిర్యాదులు

గంభీరావుపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రంవద్ద ఫ్లెక్సీవిషయమై వివాదం నెలకొంది. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించేందుకు మార్కెట్‌కమిటీ చైర్మన్ కొమిరిశెట్టి విజయతిరుపతితోపాటు పలువురు అక్కడికి చేరుకున్నారు. అప్పటికే అక్కడికి వచ్చిన బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు ఫ్లెక్సీలో స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్, ఎంపీ బండి సంజయ్ ఫొటోలు లేవని నిర్వాహకులను ప్రశ్నించారు. దీంతో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు మధ్య వాదోపవా దాలు పెరిగి, తోపులాటకు దారితీసింది. స్థానిక ఎస్‌ఐ ప్రేమానందం, ఏఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలోని పోలీస్‌సిబ్బంది జోక్యం చేసుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఇదిలా ఉండగా తమ పార్టీ నాయ కులపై కాంగ్రెస్ నాయ కులు దాడిచేశారని సిరిసిల్ల నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ ముఖ్యనేతలు గంభీరావుపేట పోలీస్ స్టేషన్‌కు తరలి వచ్చారు. తమనాయ కులపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. కొనుగోలు కేంద్రం ప్రారంభాన్ని అడ్డుకుని, విధులకు ఆటంకం కలిగించారంటూ బీఆర్‌ఎస్ నాయకులపై కాంగ్రెస్ నేతలు సైతం ఫిర్యాదు చేశారు. రెండు పార్టీలనేతలు ఒకరిపై ఒకరు విమర్శిస్తూ పోలీస్‌స్టేషన్ వద్ద నినాదాలు చేసుకోవడంతో ఉద్రిక్తతగా మారింది.



కొనుగోలు కేంద్రంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకుల వాగ్వాదం

గంజాయి పట్టివేత

గంగాధరర,ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం గట్టుబూత్కూర్‌లో గురువారం 68గ్రాముల గంజాయిని పట్టుకున్నట్లు ఎస్ఐ వంశీక్రిష్ణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గట్టుబూత్కూర్ గ్రామశివారు రైసుమిల్లులో పనిచేస్తున్న బీహార్ రాష్ట్రానికి చెందిన ముకేష్ వద్ద గంజాయి ఉన్నట్లు సమాచారం మేరకు తనిఖీ చేయగా గంజాయి లభించినట్లు ఆయన తెలిపారు. 68గ్రామాలు గంజాయితో పట్టుబడిన ముకేష్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వీణవంక, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్కల్ గ్రామంలోని మానేరు వాగునుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్ ఓనర్ ఈరవేణి శ్రీనివాస్, పూసల శంకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.

రైలు కింద పడి ఒకరి బలవన్మరణం

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని రైలుకింద పడి ఓ వృద్ధుడు గురువారం ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. హుజూరాబాద్ పట్టణంలోని మామిండ్లవాడకు చెందిన పొట్టబత్తిని సురేందర్(69) ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. దీనికి తోడు ఆర్థిక ఇబ్బందులు తోడు కావడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. గురువారం గుర్తుతెలియని రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య సావిత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ జి తిరుపతి తెలిపారు.

నిజాం దోపిడీ, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడిన 'సింగిరెడ్డి' కుటుంబం

● సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

తంగళ్లపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): నైజాం అరాచకాలు, దోపిడీ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా కామ్రేడ్ సింగిరెడ్డి భూపతిరెడ్డి కుటుంబం నిలిచిందని సీపీఐ జాతీయకార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటయోధుడు సింగిరెడ్డి భూపతిరెడ్డి కుమార్తె బద్దం సత్తవ్వ పది రోజుల క్రితం మృతిచెందగా గురువారం బాధిత కుటుంబ సభ్యులను చాడ వెంకటరెడ్డి, సీపీఐ నాయకులు పరామర్శించారు. బద్దం సత్తవ్వ చిత్రపటం వద్ద నివాళులర్పించి కుటుంబ చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆనాడు నైజాం అరాచకాలు, దోపిడీ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా అన్నబేరి ప్రభాకర్ రావు, సింగిరెడ్డి భూపతిరెడ్డిలు సాయుధ దళాల నిర్మాణంచేపట్టి నైజాం, జమిందారులు, భూస్వాము లకు వ్యతిరేకంగా ప్రజలను పోరాటం దిక్కు నడిపించారని గుర్తుచేశారు. ఆ పోరాటానికి సింగిరెడ్డి భూపతిరెడ్డి కుటుంబం మొత్తం ఉద్యమానికి మద్దతును తెలియజేస్తూ నిజాం పోలీసుల దాడులను నిత్యం ఎదుర్కొంటూ ఇంటికి వచ్చిన దళాలు, దళనాయకులకు సహాయసహకారాలు అందించి ఉద్యమాన్ని కాపాడారన్నారు. పోలీసులు, నైజాంసర్కార్ దాడులకు వ్యతిరేకంగా నిలబడి చివరి వరకు ఎర్రజెండా పోరాటస్మృతులను, సింగిరెడ్డి భూపతిరెడ్డిచేసిన త్యాగాలను స్మరించుకుంటూ తండ్రి ఆశయాలకు అనుగుణంగా బద్దం సత్తవ్వ ముందుకు సాగిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో జిల్లాకార్యదర్శి గుంటివేణు, జిల్లా కార్యవర్గసభ్యులు మంద సుదర్శన్, మీసం లక్ష్మణ్, కడారి రాములు, అజ్జువేణు, సోమనాగరాజు, మంత్రి చంద్రయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుర్రరాకేష్‌రెడ్డి పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, నాయకులు

రెండు ఇళ్లలో చోరీ



విచారణ చేపట్టిన సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై అంజయ్య

చందుర్తి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండల కేంద్రంలో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రెండు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. గ్రామస్థులకథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చిర్రం రాజవ్వ, వెంగళ వినోద ఇళ్ల తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. చిర్రం రాజవ్వ ఇంటికి తాళంవేసి తన కుమారుడి ఇంటికి నిద్రిం చేందుకు వెళ్లింది. ఉదయం ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా రూ.15వేల నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు తెలిపింది. ప్రశాంత్ అనే పాస్టర్ తన ఇంటిముందు నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాన్ని ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. వినోద 25రోజులక్రితం హైదరాబాద్ వెళ్లి నందున వివరాలు తెలియవలసి ఉన్నది. ఈ సంఘటనపై చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై అంజయ్య విచారణ చేపట్టారు.


ఎలంగందుల ఖిల్లా

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 17, (ఆంధ్రజ్యోతి): భారతదేశం చారిత్రక, పౌరాణిక, ఇతిహాసిక, సాంస్కృతిక, నైతిక వారసత్వానికి వాసి గాంచిన నేల. దేశంలో ఎన్నో కట్టడాలు, చరిత్రలు, స్థలాలు, వస్తువులు మన దేశ, ప్రాంత వైభవాన్ని ప్రపంచానికి చాటి చెబుతున్నాయి. ఒక్కో రాష్ట్రానికి, జిల్లాకు ప్రత్యేక చరిత్ర, సంస్కృతి, శిల్ప సంపద ఉండగా అవన్నీ మనల్ని మంత్రముగ్ధుల్ని చేసి మరపురాని మధుర జ్ఞాపకాలుగా నిలుపుతాయి. ప్రతీ యేటా ఏప్రిల్ 18న అంతర్జాతీయ చారిత్రక కట్టడాల దినోత్సవంగా (ప్రపంచ వారసత్వ దినోత్సవం, వరల్డ్ హెరిటేజ్ డే) జరుపుకుంటారు. ఐక్య రాజ్య సమితిలోని సభ్య దేశాలు, అంతర్జాతీయ పురాతన కట్టడాలు, స్థలాల పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో వారసత్వ సంపద పరిరక్షణకు ఒకరికొకరు పలు అంశాలతో పరస్పరం సహకరించుకోవాలని ఆఫ్రికాలోని ట్యూనీషియాలో 1982, ఏప్రిల్ 18న సమావేశంలో ఈ దినోత్సవాన్ని ఏర్పాటు చేశారు. ఈ ప్రతిపాదనను యునెస్కోకు పంపగా ఏప్రిల్ 18ని ప్రపంచ వారసత్వ దినోత్సవంగా ప్రకటించారు. ఈ సందర్భంగా పురాతన కట్టడాలు, స్థలాల పరిరక్షణ పట్ల ప్రజల్లో అవగాహన కల్పించి వారసత్వ సంపద ప్రాధాన్యం తెలిపేలా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా సుమారు 800 పురాతన కట్టడాలు, స్థలాలను గుర్తించి పరిశీలన జరుపుతున్నారు.

ఘనమైన వారసత్వ సంపద

- పట్టించుకోక శిథిలావస్థకు..
- దెబ్బతింటున్న పలు కట్టడాలు
- నేడు ప్రపంచ వారసత్వ దినోత్సవం

ఉమ్మడి జిల్లాలో పలు కట్టడాలు

ఉమ్మడి జిల్లాలో పురాతత్వ వారసత్వ కట్టడాలు సుమారు 150 వరకు ఉండగా అందులో పురాతత్వ శాఖ గుర్తించిన ప్రదేశాలు, కట్టడాలు 50 నుంచి 60 వరకు ఉన్నాయి. 1850 నుంచి 1950 వరకు వివిధ ప్రదేశాలు, గ్రామాల్లో కట్టిన 350 బురుజులు ఉన్నాయి. మౌర్యులు, శాతవాహనులు, విష్ణుకుండినులు, బాదామీ చాళుక్యులు, పశ్చిమ చాళుక్యులు, కాకతీయులు, వేములవాడ చాళుక్యులు, పొలవాస, విజయనగర రాజులు ఈ జిల్లా ప్రాంతానికి వచ్చినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. అనంతరం బహామనీయులు, మొఘలాయిలు, కుత్‌బు షాహీలు, అసబ్‌జాయిలు వంటి ముస్లిం రాజులు ఈ నేలపై కాలు మోపారు. విస్తారమైన గోదావరి, మానేరు వంటి నదీతీరాలు వెలియడంతో మన కట్టడాల చరిత్ర మరింత విలసిల్లింది. కోటలు, ఆలయాలు, మసీదులు, చర్చిలు, రాజులు, మంత్రులు, జమీందారుల స్థావరాలు ప్రాచీన చరిత్రకు సాక్షీభూతంగా నిలుస్తున్నాయి. ధూళికట్ట బౌద్ధ స్తూపం అమరావతి స్తూపం కంటే పురాతనమైనదిగా చెబుతారు. అది ప్రస్తుతం హీన దశకు చేరుకుంటోంది. జగిత్యాల, ఎలగందుల, మొలంగూరు లాంటి కోటలు శిథిలమవుతున్నాయి. ఐదు కోట్ల వ్యయంతో అప్పటి కేంద్ర మంత్రి చిరంజీవి, ఎంపీ పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎలగందుల ఖిల్లాలో సౌండ్, లైటింగ్ షో ఏర్పాటు చేశారు. రెండు సంవత్సరాలు అనంతరం అది మూలన పడింది.


వేమువాడలోని భీమేశ్వరాలయంలోని జైన విగ్రహాలు

కోటి లింగాలలో తొలి శాతవాహన స్థావరం


కోటి లింగాలలో తొలి శాతవాహన స్థావరం 1975లో బయట పడగా గోదావరి నీరు ముంపునకు గురి కాకుండా రక్షణ గోడ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. చారిత్రక నేపథ్యం ఉన్న పొలాస ఆలయాలు శిథిలమవుతున్నాయి. వేములవాడ భీమేశ్వర ఆలయంలో సప్తమాతృకలు, లింగాలు, జైన విగ్రహాలు కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. సుమారు 1700 సంవత్సరాల కేదారీశ్వర ఆలయం, నగరేశ్వర దేవాలయం అభివృద్ధికి నోచుకోవడం లేదు. కరీంనగర్ పాతబజార్ గౌరీశంకరాలయంలో రెండు జైన విగ్రహాలుండగా ఒకటి ధ్వంసం కాగా మరొకటి తాజాగా వెలుగులోకి వచ్చింది. వేములవాడ చాళుక్యుల కాలం నాటి సిరిసిల్ల ఎల్లారెడ్డిపేట సమీ పంలోపి మూలవాగు పుట్టిన భీముని మల్లారెడ్డిపేట సీతారామ, ఆంజనేయ స్వామి ఆలయాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. గోదావరి తీరంలోని మంథనిలో 25 ఆలయాలుండగా గౌతమేశ్వర స్వామి దేవాలయం కాకతీయుల కాలం నాటిది. నగునూరు, కొత్తపల్లి, బొమ్మలమ్మ గుట్ట దేవాలయాలు కూడా అభివృద్ధికి నోచుకోవాల్సిన అవసరం ఉంది. 1905లో ఎలందుల నుంచి కరీంనగర్‌కు జిల్లా తరలివచ్చిందని చెబుతారు. జిల్లా పర్యాటక అధికారిగా ఏడాదిగా ఇన్‌చార్జితోనే నెట్టుకొస్తున్నారు


కరీంనగర్‌లోని మ్యూజియం

ఆదరణకు నోచుకోని కరీంనగర్ మ్యూజియం

కరీంనగర్‌లో అర్ధ శతాబ్దం క్రితం ఏర్పాటు చేసిన ప్రభుత్వ పురావస్తుశాఖ మ్యూజియం ఆదరణకు నోచుకోవడం లేదు. పట్టించుకునే వారు లేక శిథిలా వస్థకు చేరుకుంది. గోడలకు రంధ్రాలు ఉండడంతో విలువైన విగ్రహాలు, ఇతర వస్తువులకు భద్రత కరువైంది. పురావస్తు శాఖలో నిధు లు, సిబ్బంది కొరతతో ఈ మ్యూజి యం, కార్యాలయాల నిర్వహణ భారంగా మారింది. మ్యూజియం లోని ప్రదర్శనశాలలో ఇత్తడి, ఆదిమ జాతుల కాలం నాటి పాతరాతి యుగం ఆనవాళ్ళు, ప్రముఖ చరిత్రకారుడు ఠాకూర్ రాజారాంసింగ్ భద్రాచలం నుంచి బాసర వరకు తిరిగి సేకరించిన ఆదిమ మానవులు వాడిన రాతి పని ముట్లు, రెండు వేల సంవత్సరాల చరిత్ర గల శాతవాహనుల కాలం నాటి కోటి లింగాల బౌద్ధ స్తూప ఖండికలు ఉన్నాయి.


జగిత్యాల కోట


మొలంగూర్ ఖిల్లా


ఎలంగందుల ఖిల్లాలో మినార్‌లు

ఐఆర్‌సీటీసీ సమ్మర్ ప్యాకేజీ

- హైదరాబాద్ నుంచి భారత్ గౌరవ్ రైలు యాత్ర
- జనరల్ మేనేజర్ టూరిజం డీఎస్‌జీపీ కిషోర్



పెద్దపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి భారత్ గౌరవ్ రైలు యాత్ర సమ్మర్ స్పెషల్ ప్యాకేజీ అందుబాటులో ఉన్నాయని ఐఆర్‌సీటీసీ జనరల్ మేనేజర్ టూరిజం డీఎస్‌జీపీ కిషోర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత రైల్వే క్యాటరింగ్ టూరిజం కార్పొరేషన్ ద్వారా ఐఆర్‌సీటీసీ భారత గౌరవ టూర్ పేరుతో ప్రత్యేకంగా దేశంలోని వివిధ పర్యాటక ప్రాంతాలను హైదరాబాద్ నుంచి ప్యాకేజీలు తయారు చేసిందని, వీటిలో ట్రైన్, బస్ జర్నీ, హోటల్, భోజన ఖర్చులు, గైడ్‌తో సహ సైట్ సీయింగ్ ఉంటాయని పేర్కొన్నారు. భార త గౌరవ టూర్‌లో భాగంగా హైదరాబాద్ నుంచి ఐదు ప్యాకేజీలలో ప్రత్యేక రైళ్లు ఉన్నాయని తెలిపారు.

- ఈనెల 23 నుంచి మే 2 వరకు 9 రాత్రులు, 10 రోజులలో హరిద్వార్, రిషికేష్ వైష్ణవ దేవి, ఆనంద్‌పూర్, నైనాదేవి, అమృత్‌సర్ పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి. ప్రతీ ఒక్కరికి 18,150 రూపాయల ఖర్చు అవుతుంది.
- మే 8 నుంచి 17 వరకు 9 రాత్రులు, 10 రోజులలో వారణాసి, పూరి, గయా, అయోధ్య, ప్రయాగ్ రాజ్, కోణార్క్ పర్యాటక ప్రాంతాలను కవర్ కానుండగా, ఒక్కరికి 16,800 రూపాయల ఖర్చు అవుతుంది.
- మే 22 నుంచి 30 వరకు 8 రాత్రులు, 9 రోజులలో అరుణాచలం, రామేశ్వరం, తంజావూర్, కన్యాకుమారి, త్రివేండ్రం, త్రిచి, మధురై పర్యాటక ప్రాంతాలు కవర్ కానుండగా, ఒక్కరికి రూ.14,700 ఖర్చు అవుతుంది.
- జూన్ 4 నుంచి 12 వరకు 8 రాత్రులు, 9 రోజులలో మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్, త్రయంబకేశ్వర్, భీమశంకర్, ఘృష్ణేశ్వర్, ఎల్లోరా, మోహం, నాగ్‌పూర్ పర్యాటక ప్రాంతాలు కవర్ కానుండగా, ఒక్కరికి 14,700 రూపాయల ఖర్చు అవుతుంది.

భారత గౌరవ టూర్‌లో పాల్గొనే వారు www.irctctourism.com వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో లేదా సికింద్రాబాద్ రోడ్డులోని ఐఆర్‌సిటిసి, మూడవ ఫ్లోర్, ఆక్స్‌ఫర్డ్ ప్లాజా, సికింద్రాబాద్‌లో బుక్ చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 04027702407, 9701360701, 9281495845, 9281495843, 9281030750, 9281030740 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

నీరుకుళ్ల రంగనాయక స్వామి రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

సుల్తానాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలంలోని నీరుకుళ్ల మానేటి రంగనాయక స్వామి రథోత్సవం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవం ముఖ్యమైనదిగా భావిస్తారు. ఈఓ శంకర్ ఆధ్వర్యంలో భక్తి గీతాలు, సంకీర్తనలు ఆలపించే కార్యక్రమం ఏర్పాటు చేశారు. రథోత్సవంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావు, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, సతీష్, పెద్దన్న శంకర్, అర్చకులు గోవర్ధనగిరి మనోహరాచార్యులు, రాజ్ కమారాచార్యులు, మాజీ సర్పంచ్ విజేందర్, పెరుమారెడ్డి పాల్గొన్నారు.

ఎస్సారార్‌లో షార్ట్ టర్మ్ బ్యూటీషియన్ కోర్సు

గణేశ్‌నగర్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఎస్సారార్ కళాశాలలో షార్ట్ బ్యూటీషియన్ కోర్సు అందిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కల్వకుంట్ల రామకృష్ణ గురువారం ప్రకటనలో తెలిపారు. బ్యూటీషియన్ సర్టిఫికెట్ కోర్సుతో వచ్చే సర్టిఫికెట్ ద్వారా మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించవచ్చన్నారు. 25 నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

మహిళా హక్కుల పరిరక్షణే లక్ష్యం

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి



మహిళా హక్కుల పరిరక్షణ యాత్రలో మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

గణేశ్‌నగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మహిళా హక్కుల పరిరక్షణే లక్ష్యంగా, అంబేద్కర్, పూలే ఆశయాల సాధన దిశగా ఐద్వా తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బస్సుయాత్ర చేపట్టినట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. మహిళా హక్కుల పరిరక్షణ యాత్ర గురువారం కరీంనగర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా తెలంగాణ చౌక్ వద్ద ఐద్వా కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మల్లు లక్ష్మి మాట్లాడారు. అంబేద్కర్, జ్యోతిబాపూలే ఆశయాల సాధన, మహిళా హక్కుల పరిరక్షణ కోసం అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం కృషి చేస్తుందన్నారు. మహిళలపై ఆగాయిత్యాలు జరగకుండా చట్టాలు కఠినతరం చేయాలని, ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పరిరక్షణ యాత్రకు, రైతు సంఘం మాజీ కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గుడికందుల సత్యం, రైతు సంఘం అధ్యక్షుడు వర్ణ వెంకటరెడ్డి, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు సాగర్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి.తిరుపతి, నరేష్ పటేల్ సంపూర్ణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్.అరుణ జ్యోతి, రాష్ట్ర సహా య కార్యదర్శి కేఎన్ ఆశలత, నల్లిగంటి రత్నమాల తదితరులు పాల్గొన్నారు.

జూన్‌లో వేములవాడ ఆలయ అభివృద్ధి పనులు

- భీమన్న ఆలయంలో భక్తులకు దర్శనం
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయ పునర్నిర్మాణ పనులు జూన్ మాసంలో ప్రారంభించనున్న సందర్భంగా భక్తులకు అనుబంధ ఆలయ మైన భీమేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు తాత్కాలికంగా ఏర్పాట్లు చేస్తున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, దేవదాయశాఖ కమిషనర్ శ్రీధర్, వీటీడీఏ వైస్‌చైర్మన్, సెక్రెటరీ, కలెక్టర్ సందీప్ కుమార్‌లతో కలిసి గురువారం రాజన్న ఆలయాన్ని సందర్శిం చారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయం ప్రాంగణం, ఆవరణ, ఆలయం ముందు భాగంతో పాటుగా శ్రీభీమేశ్వర స్వామివారి ఆలయాన్ని క్షేత్ర స్థాయిలో ఆలయ అభివృద్ధి నమూనాలతోపాటు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి వేముల వాడ దేవాలయ అభివృద్ధికి రూ.38 కోట్లు ప్రకటించారన్నారు. ఆగమ శాస్త్రం, వాస్తు అంశాలను దృష్టిలో పెటుకుని భక్తులకు ఇబ్బంది కలగకుండా పనులు చేపట్టాలని కార్యాచరణ రూ పొందిస్తున్నామన్నారు.


ఆలయ ప్రాంగణంలో ఆది శ్రీనివాస్, శైలజరామయ్యర్

శృంగేరి పీఠం అనుమతితో పనులు ప్రారంభిస్తాం ● శైలజరామయ్యార్

వేములవాడ రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.76 కోట్లు, అన్నదాన సత్రానికి రూ.35 కోట్లు, రోడ్డు వెడల్పు పనులకు రూ.47 కోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు. దేవాలయ అభివృద్ధితో పాటుగా పట్టణ అభివృద్ధి సమాంతరంగా జరగాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. అన్న దాన సత్రం నిర్మాణ పనులకు టెండర్ పూర్తి చేశామని తెలిపారు. శృంగేరి పీఠాధిపతుల అనుమతి, ఆశీర్వాదం తీసుకుని ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభిస్తామన్నారు. సమావేశంలో స్థపతి వల్లినాయగం, ఆర్కిటెక్ట్ సత్యనారాయణ, ఈవో వినోద్‌రెడ్డి, ఈఈ రాజేష్, డీఈ రఘునందన్, ఆర్‌అం డ్‌బీ సీఈ బిల్డింగ్స్ రాజేశ్వర్‌రెడ్డి, సీఈ ఎలక్ట్రికల్ లింగారెడ్డి, ఎస్‌ఈ లక్ష్మణ్, జిల్లా ఈఈ వెంకట రమ ణయ్య, ప్రధాన అర్చకులు ఉమేష్‌శర్మ, ఉప ప్రధాన అర్చకులు నమిలికొండ రాజేశ్వరశర్మ, శరత్‌శర్మ పాల్గొన్నారు.

రాజన్న సేవలో..

రాజన్న ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా సందర్శనకు వచ్చిన దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, దేవదాయశాఖ కమిషనర్ శ్రీధర్, వీటీడీఏ వైస్ చైర్మన్, సెక్రెటరీ, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాలకు స్వాగతం పలికారు.

రాజన్న ఆలయాభివృద్ధిపై సమీక్ష

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధిపై దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజరామయ్యర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా వివిధ శాఖల అధికారులతో కలిసి ఆలయ గెస్ట్‌హౌస్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాజన్న ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా అవసరమైన మార్గదర్శకాలు, అనుమతుల కోసం ఈ నెల 27వ తేదీన శృంగేరి పీఠం వెళ్లాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రూ.76 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు భూసేకరణ పెండింగ్ లేదని, ఆలయ నిర్మాణ పనుల మానిటరింగ్ కమిటీని జూన్ నెలలో ఏర్పాటు చేయాలన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో ధార్మిక సలహాదారులు గోవిందహరి, స్థపతి వల్లినాయగం, ఆర్కిటెక్ట్ సత్యనారాయణ, ఈవో వినోద్, ఈఈ రాజేష్, డీఈ రఘు నందన్, ఆర్అండ్‌బీ అధికారులు రాజేశ్వర్ రెడ్డి, లింగారెడ్డి, లక్ష్మణ్, వెంకట రమణయ్య, ప్రధాన అర్చకులు ఉమేష్‌శర్మ తదితరులు ఉన్నారు.


పొలం వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

పంటచేనుపై మూడో కన్ను

- పొలం వద్ద సీసీ కెమెరా ఏర్పాటు చేసిన రైతు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఇటీవల దొంగలు పెట్రేగిపోతున్నారు. ఇళ్లు, ఆలయాలే కాకుండా వ్యవసాయ పొలాల వద్ద తమ చేతులకు పని చెబుతున్నారు. వ్యవసాయ సామగ్రిని కాపాడుకునేందుకు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన రైతు గన్న బాల్‌రెడ్డి దుమాల గ్రామశివారులోని తనకున్న పొలం వద్ద రూ.5వేలు వెచ్చించి విద్యుత్ స్తంభానికి సీసీ కెమెరా బిగించాడు. వర్షానికి తడవకుండా ఉండడంతో పాటు ఎవరికీ అనుమానం కలగకుండా కరెంటు స్తంభంపై ఓ ఖాళీ డబ్బాను సగం వరకు తొలగించి అందులో సీసీ కెమెరా ఏర్పాటు చేశాడు. గతంలో పొలం వద్ద నుంచి ఎరువుల సంచులు, పైపులను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు రైతు బాల్‌రెడ్డి పేర్కొన్నాడు. సీసీ కెమెరాను బిగించడంతో చోరీలు తగ్గాయని చెబుతున్నాడు.

దాహం తీర్చని 'మిషన్ భగీరథ'

- గ్రామాల్లో పూర్తి కానీ పైప్ లైన్ పనులు
- పట్టించుకోని అధికారులు


జాగీర్‌పల్లిలో నీరు రాక నిరుపయోగంగా ఉన్న మిషన్ భగీరథ నల్లా

సైదాపూర్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఇంటింటికి మంచి నీరు ఇవ్వాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం ప్రవేశ పెట్టింది. అధికారుల నిర్లక్ష్యంతో మిషన్ భగీరథ నీరు ప్రజల దాహార్తిని తీర్చలేకపోతోంది. సైదాపూర్ మండలంలో ఏ గ్రామానికీ పూర్తి స్థాయిలో మిషన్ భగీరథ నీరు అందడం లేదు. వేసవి కాలం సమీపించడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయి గ్రామాల్లో మంచి నీటి ఎద్దడి ఏర్పడే అవకాశముంది. మండలంలో ఏ గ్రామంలోనూ పూర్తి స్థాయిలో మిషన్ భగీరథ పనులు పూర్తి కాలేదు. కొన్ని గ్రామాల్లో ఇంటింటికి పైపులు వేసి నల్లాలు ఏర్పాటు చేశారు. కానీ ఆ పైప్‌లైన్‌కు నీటి కనక్షన్ ఇవ్వ లేదు. దీంతో ఇంటి ముందు పేరుకే మిషన్ భగీరథ నల్ల ఉంది కానీ నీరు రావడం లేదని మహిళలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

వ్యవసాయ బావుల నుంచి నీటి సరఫరా

సైదాపూర్ మండలం మెట్ట ప్రాంతం కావడం, చాలా రోజుల నుంచి వర్షాలు పడక పోవడం, ఎండలు ముదిరి ఉష్ణోగ్రతలు పెరగడంతో భుగర్భ జలాలు అడుగంటాయి. దీంతో గ్రామాల్లో నీటి ఎద్దడి ప్రారంభమైంది. మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో ఆయా గ్రామా పంచాయతీల ఆధ్వర్యంలో ప్రైవేట్ వ్యవసాయ బావుల నుంచి నీటిని కొనుగోలు చేసి గ్రామంలోకి సరఫరా చేస్తు న్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మిషన్ భగీరథ నీరు సరఫరా చేసి ప్రతీ ఇంటికి నీరు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

నీళ్లు రావడం లేదు

రాధారపు పద్మ, జాగీర్‌పల్లి



మిషన్ భగీరథ నీళ్లు వస్తాయని ఇంటి ముందు నల్లా పెట్టి ఐదేళ్లు గడిచాయి. ఇప్పటి వరకు ఒక్క బొట్టు నీళ్లు రాలే దు. పెద్ద సార్లు మాకు మిషన్ భగీరథ నీళ్లు వచ్చేలా చూడాలి.


వృథాగా మిషన్ భగీరథ నల్లా పైపు

సర్వాయిపేటలో గ్రామ పంచాయతీ కొనుగోలు చేసిన వ్యవసాయ బావి నుంచి నల్లాల బావికి పైపుల ద్వారా నింపుతున్న నీరు

మొదలైన రేషన్ కార్డుల సర్వే

(5వ పేజీ తరువాయి)

అర్హులైన వారి దరఖాస్తులను తహసీల్దార్లు జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి లాగిన్‌కు పంపిస్తున్నా రు. అక్కడి నుంచి డీఎస్‌ఓ అర్హులైన వారి దరఖా స్తులను రాష్ట్ర స్థాయిలో ఉండే అధికారి లాగిన్‌కు పంపుతున్నారు. దరఖా స్తుల పరిశీలన అనంతరం అర్హులైన వివరాలను క్షేత్ర స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి పంపిస్తున్నారు.

● చివరగా 360 డిగ్రీస్ యాప్ ద్వారా పరిశీలన

కొత్త రేషన్ కార్డుల జారీ కోసం క్షేత్ర స్థాయిలో అర్హులను గుర్తించిన తర్వాత రాష్ట్ర స్థాయిలో చివరగా మరోసారి 360 యాప్ ద్వారా పరిశీలిస్తున్నారు. అక్కడ అర్హులని తేలిన వారికి కొత్త రేషన్ కార్డులను జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే నవం బర్‌లో నిర్వహించిన కులగణన సర్వే సందర్భంగా మొత్తానికే రేషన్ కార్డులు లేని కుటుంబాలు 15,255 ఉన్నట్లు గుర్తించారు. వీరు అర్హులా, కాదా అని జనవరిలో నిర్వహించిన గ్రామసభలకు ముందు రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో సర్వే చేసి 12,572 కుటుంబాలు అర్హులని గుర్తించారు. జనవరి 26న ఐదారు కుటుంబాలకు కొత్త కార్డుల పత్రాలను అంద జేశారు. కానీ మిగతా వారికి ఇప్పటి వరకు ఇవ్వలేదు. కార్డులు ముద్రిం చిన తర్వాత ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు చెబుతున్నారు. రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని చెబుతున్నప్ప టికీ కొత్త కార్డులను మంజూరు చేయక పోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు తమకు ఎప్పుడు అందుతా యని అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సత్వరమే స్పందించి కొత్త రేషన్ కార్డులను త్వరగా పంపిణీ చేయాలని కోరుతున్నారు.

శ్రీచైతన్యలో వీడ్కోలు హంగామా



డ్యాన్సులు చేస్తున్న విద్యార్థినులు

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మార్కండేయ కాలనీలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో గురువారం శ్రీచైతన్య డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. కళాశాల కర స్పాండెంట్ ఎం.సత్యనారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకొని ఉన్నత విద్యలో రాణించాలన్నారు. అనంతరం కళాశాలలో తృతీయ సంవత్సరం బీఎస్సీ చదువుతున్న విద్యార్థినీ అంకటి స్నేహిత విప్రో కంపెనీలో టాస్క్ ద్వారా ఉద్యోగం పొం దినందుకు సన్మానించారు. సీనియర్ విద్యార్థులకు జూనియర్లు వీడ్కోలు పలుకుతూ జరిగిన సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. డైరెక్టర్ జి.సతీ ష్, ప్రిన్సిపాల్ యాకాంతం, వైస్ ప్రిన్సిపాల్ రమేష్ పాల్గొన్నారు.

ఓదెల - 2 సినిమా రిలీజ్‌పై సంబరాలు

సుల్తానాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీరామ థియే టర్ వద్ద ఓదెల 2 సినిమా విడుదల సందర్భంగా గురువారం సంబరాలు జరుపుకున్నారు. ఓదెల మండల కేంద్రానికి చెందిన సినీ దర్శకులు సం పత్ నంది దర్శకత్వంలో నిర్మించారు. నటీ నటులు థియేటర్ ఆవరణలో కేక్ కట్ చేసి ప్రేక్షకులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఓదెల మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్, వెంకటస్వామి, బండారు కుమార్, రవీందర్ నంది, నాగపురి పైడి రాజు, తోట తిరుపతి, శ్రీనివాస్, రవిందర్ పాల్గొన్నారు.

కృష్ణవేణిలో ఏఐ టెక్నాలజీ


అవగాహన కల్పిస్తున్న ఎగ్జిక్యూటివ్ రమేష్

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యాసంవత్సరంలో కృష్ణవేణి విద్యాసంస్థల్లో ఏఐ టెక్నాలజీని ప్రారంభిస్తున్నామని పాఠశాల డైరెక్టర్ మంజులాశ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గురువారం గోదావరిఖని లోని కృష్ణవేణి విద్యాసంస్థల్లో ఆర్టిఫిషల్ ఇంటిలిజెంట్ టెక్నాలజీ(ఏఐ)పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంజులా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యలో మార్పు తీసుకురావడంలో కృష్ణవేణి సంస్థకే సాధ్యమవుతుందన్నారు. ఈడోస్ ఎగ్జిక్యూటివ్ ఏ రమేష్ ఏఐ టెక్నాలజీపై అవగాహన కల్పించారు. పాఠశాల ప్రిన్సిపాల్స్ రాజిరెడ్డి, రామకృష్ణ, సత్యనారాయణ, శైలజ, ఉపాధ్యాయ బృందం, పోషకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్

మంథని, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మంథని తహసీల్దార్‌గా కుమార స్వామి గురువారం బాధ్యతలు స్వీకరించారు. రామగుండం నుంచి బదిలీ పై వచ్చిన ఆయన బాధ్యతలు స్వీకరించగా డీటీ గిరితోపాటు కార్యాలయ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు. మీసేవా కేంద్రాల యజమానులు సన్మానించారు. జిల్లా అధ్యక్షుడు అట్టె రాజు, ప్రయాకర్‌రావు చంద్రశేఖర్ (శ్యాం), పుప్పాల సతీష్, బండారి రమేష్, పర్శవేన సతీష్, మేడి వెంకటేశ్వర్లు, మేడి జగన్ కాయితోజు సాయికిరణ్‌లు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్‌పై అవగాహన

రామగిరి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని రత్నాపూర్‌లో వ్యవ సాయ అధికారులు గురువారం ఫార్మర్ రిజిస్ట్రీ సదస్సును నిర్వహించారు. గ్రామంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో డివిజన్ పరిధి లోని వ్యవసాయ, విస్తరణ అధికారులతో ఫార్మర్ రిజిస్ట్రీ పై అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యవసాయ సంచాలకులు అంజని, జ్యోతిర్మా య్‌లు మాట్లాడారు. ఆధార్‌తో గుర్తింపు ఇచ్చినట్లుగానే ప్రతీ రైతుకు 11 అంకెలతో యూనిక్ కోడ్ కేటాయించాలని కేంద్రం నిర్ణయించిందని పేర్కొ న్నారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజ్ చేసేందుకు ప్రాజెక్టును చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతీ రైతు భూముల వివరాలతో ఫార్మర్ రిజిస్ట్రీ నిర్వహిస్తామని సూచించారు. రెవెన్యూశాఖ ద్వారా సేకరించిన భూ యాజమాన్య వివరాలను రైతు ఆధార్ సంఖ్యను అనుసంధానం చేసి ఫార్మర్ ఐడి ని కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు ఏ రకమైన చట్టబద్ధ యాజమాన్య హక్కును కల్పించదని పేర్కొన్నారు. సమావేశంలో మండల వ్యవసాయ అధికారులు శ్రీకాంత్, రామకృష్ణ నవ్య, విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో కొనుగోలు కేంద్రాలు


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కొత్త శ్రీనివాస్

మంథని/మంథనిరూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రా లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. శ్రీపాదకాలనీలో, గంగాపురి, ఎక్లాస్‌పూర్, ఖానాపూర్ గ్రామాల్లో పీఏసీ ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు కేంద్రాలను ఏర్పా టు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరతో ఎలాంటి కటింగ్ లేకుండా కొనుగోలు చేస్తున్నా మన్నారు. డైరెక్టర్లు రావికంటి సతీష్, దాసరి లక్ష్మి, కిషన్‌రెడ్డి, బెల్లంకొండ ప్రకాష్‌రెడ్డి, ఆకుల రాజబాబు, కొత్త శ్రీనివాస్, దేవళ్ళ విజయ్‌కుమార్, కాంగ్రెస్ నేతలు రమ-సురేష్‌రెడ్డి, ముస్కుల సురేందర్‌రెడ్డి, పేరవేన లింగయ్య, కుడుదుల వెంకన్న, అధికారులు మామిడాల అశోక్‌కుమార్, సురేందర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుధవారం పేట్, ఆదివారంపేట్ గ్రామాల్లో ఐకెపి, సొసైటీ ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన సెంటర్‌లను గురువారం ప్యాక్స్ చైర్మన్ అల్లాడి యాదగిరిరావు ప్రారంభించారు. ప్యాక్స్ వైస్ చైర్మన్ ఎలువక కొమురయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రొడ్డబాపన్న, మాజీ ఎంపీపీ ఆరెల్లి దేవక్క, మాజీ జెడ్‌పీటీసీ మైదం భారతివరప్రసాద్, మాజీ సర్పంచ్‌లు బుద్దార్థి బుచ్చయ్య, దేవునూరి రజిత, మొగిలి గ్రామస్థులు, రైతులు పాల్గొన్నారు.

కమాన్‌పూర్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్దపల్లి, పెంచికల్‌పేట, నాగారం, రొంపికుంట, గొల్లపల్లి, గుండారం గ్రామాలలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురవారం పీఏసీఎస్ చైర్మన్ ఇనగంటి భాస్కర్ రావు ప్రారంభించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో రైతులు తమ ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు. దళారులకు తక్కువ ధరకు ధాన్యాన్ని అమ్ముకొని రైతులు నష్టపోవద్దన్నారు. సింగిల్ విండో చైర్మన్ చిందం తిరుపతి, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

ముత్తారం, (ఆంధ్రజ్యోతి): అయా గ్రామ పంచాయ తీలలో వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిం చారు. సీఈవో ప్రసాద్ మాట్లాడుతూ.... రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తుందని న్నారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

భూ సమస్యల సత్వర పరిష్కారం కోసమే భూ భారతి


మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

అంతర్గాం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): భూ సమస్యలకు సత్వర పరిష్కారం కోసమే ప్రభుత్వం భూ భారతి చట్టంను తీసుకు వచ్చిందని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం బ్రాహ్మణపల్లి రైతు వేదికలో నిర్వ హించిన భూ భారతి అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై కలెక్టర్ మాట్లాడారు. ధరణి చట్టం పరిష్కారం కానీ భూ సమ స్యలకు భూ భారతి ద్వారా పరిష్కారం దొరు కుతుందన్నారు. భూ భారతిలో గ్రామ స్థాయి లో రెవెన్యూ రికార్డుల నిర్వహణ, తప్పుల సవరణ, సాదా బైనామాల క్రమబద్ధీకరణ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ జిల్లా పరిషత్ హై స్కూల్‌ను సందర్శించి విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని, వినూత్న పద్ధతిలో విద్యాబోధన చేయాలని ఉపాధ్యా యులను ఆదేశించారు. తహసీల్దార్ తూము రవీందర్ పటేల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణు, ఆర్‌డీ ఓ గంగయ్య, మండల ప్రత్యేక అధికారి శివ య్య, ఎంపీడీఓ వేణు మాధవ్, డిప్యూటీ తహసీల్దార్ సతీష్‌రావు, నాయకులు హను మాన్‌రెడ్డి, రాజలింగం, పూదరి సత్తయ్యగౌడ్, మడ్డి తిరుపతిగౌడ్, సత్తయ్య, పాల్గొన్నారు.

కేసీఆర్ ముందు చూపుతోనే ప్రతీ ఎకరాకు సాగు నీరు


కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చందర్

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): బీఆర్ ఎస్ అధినేత మాజీ సీఎం కేసీఆర్ ముందుచూపు తోనే రాష్ట్రంలోని ప్రతీ ఎకరాకు సాగునీరు అందు తుందని రామ గుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. గురువారం బ్రాహ్మణపల్లి శివా రు పంప్‌హౌజ్ వద్ద జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా రూ.76 కోట్లతో ఎల్లంపల్లి ఎత్తిపోతల పథకం ద్వారా నియోజకవర్గంలో 20వేల ఎకరాల భూము లకు సాగునీరు అందుతున్న నేపథ్యంలో కేసీఆర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారం టీలను అమలు చేయడం లేదని విమర్శించారు. ఈ 27న వరంగల్‌లో తలపెట్టిన బీఆర్‌ఎస్ పార్టీ 25వ ఆవిర్భావ దినోత్సవ భారీ బహిరంగ సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు నడిపెల్లి మురళీధర్‌రావు, గోపు ఐలయ్య యాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు కోల సంతోష్ గౌడ్, మాజీ సర్పంచులు బండారి ప్రవీణ్, మేరుగు పోచం, దివ్య మల్లేష్, సతీష్ పాల్గొన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చని కాంగ్రెస్

గోదావరిఖని, (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు మోసపూరిత హామీ ఇచ్చి గద్దెనెక్కిందని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు అధికారం కోసం సాధ్యం కాని హామీ లు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని, ఇప్పటి వరకు ఆ వాగ్దానాలను నెరవేర్చలేదన్నారు. స్థానిక సంస్థల్లో లబ్ధిపొందడానికే రాజ్యాంగ పరిరక్షణ అంటూ ప్రజలను మోసం చేయడానికి యాత్ర చేస్తున్నారన్నారు. త్వరలోనే బీఆర్‌ఎస్ పార్టీ ప్రజల్లోకి వెళ్లి కాంగ్రెస్ మోసాలను ప్రజలకు వివరిస్తామన్నారు. నూతి తిరుపతి, సట్టు శ్రీనివాస్, అచ్చె వేణు, ముద్దసాని సంధ్యారెడ్డి, చల్లా రవీందర్, నీరటి శ్రీనివాస్, విజయ్ పాల్గొన్నారు.

యువ వికాసంలో షరతులు ఉండొద్దు

ముత్తారం ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభు త్వం ప్రవేశపెట్టిన యువ వికాసం పథకంలో ఎలాంటి నిబంధనలు లేకుండా లబ్ధిదారులకు రుణాలు మంజూ రు చేయాలని బీఆర్‌ఎస్ మండల శాఖ అధ్యక్షుడు పోతుపేద్ది కిషన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో డి మాండ్ చేశారు. సిబిల్ స్కోరు ఉంటేనే రుణాలు మం జూరు చేస్తామని బ్యాంక్ వారు పేర్కొనడం లబ్ధిదా రులను మభ్యపెట్టమేనని ఆరోపించారు. ఎలాంటి నిబంధనలు లేకుండా యువ వికాసం లబ్ధిదారులకు రుణాలు మంజూరి చేయాలని డిమాండ్ చేశారు.

రాజీవ్ రహదారి - శాలపల్లి రోడ్డుకు అనుమతులు

కోల్‌సిటీ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఎన్‌టీపీసీలోని రాజీవ్ రహదారి హెలీప్యాడ్ ట్యాంకు నుంచి నర్రశా లపల్లి ప్రభుత్వ పాఠశాల వరకు రూ.2కోట్లతో సీసీ రోడ్డు నిర్మాణానికి రామగుండం నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి, కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం పాలనపరమైన అనుమతులు ఇచ్చారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. అభివృద్ధి చెందుతున్న ప్రాంతంలో రోడ్డు అధ్వాన్నంగా ఉండడంతో 5వ డివిజన్ ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడు తున్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లకు కూడా ఇదే ప్రధాన రహదారిగా ఉంది. దీంతో వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ వెంటనే స్పందించి కమిషనర్ అరుణశ్రీ నుంచి ప్రతిపాదనలు తెప్పిం చుకుని ఆమోద ముద్ర వేశారు. 26అడుగుల వెడ ల్పుతో 1200మీటర్ల దూరం సీసీ రోడ్డు నిర్మిం చనున్నారు. అందుబాటులో ఉన్న నిధులతో రోడ్డు నిర్మాణానికి మంజూరు ఇచ్చారు. సాంకేతిక అనుమ తులు తీసుకుని టెండర్ ప్రక్రియ ప్రారంభించాలని మున్సిపల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

కొనుగోళ్లు ప్రారంభమయ్యేది ఎప్పుడో..?


కుక్కలగూడూర్ గ్రామంలో ధాన్యం నిల్వలు

పాలకుర్తి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో వరి కోతలు ప్రారంభమై దాదాపు 15 రోజులు కావస్తున్నా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో అన్నదాతలు ధాన్యం కుప్పల వద్ద రాత్రి పగలు పడిగాపులు కాస్తూ ఇబ్బందులు పడుతున్నారు. కన్నాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఎల్కలపల్లి, కన్నాల, బసంత్‌నగర్, పాలకుర్తి, కొత్తపల్లె, కుక్కలగూడూర్2, ఈసాలతక్కళ్లపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలు పేరుకుపోతున్నా అధికారులు కొనుగోళ్లు ప్రారంభించడంలేదు. దీంతో రైతులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మేడిపల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో జయ్యారం, గుడిపెల్లి, పుట్నూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ఇప్పటి వరకు కొనుగోళ్లు ప్రారంభించక పోవడంతో పగలు ఎండ, రాత్రి వీస్తున్న ఈదురుగాలులతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు కొనుగోలు కేంద్రాలను ప్రార ంభించాలని రైతులు కోరుతున్నారు.

మాజీ ఎంపీపీకి సన్మానం

రామగిరి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కన్యకాపరమేశ్వరి ఆలయ రోడ్డు నిర్మాణానికి సహ కరించిన మాజీ ఎంపీపీ ఆరెల్లిదేవక్కకొంరయ్యగౌడ్ దంపతులను గురువారం ఆలయ కమిటీ నిర్వాహకులు సన్మానించారు. ప్రధాన అర్చకుడు రామశర్మ ప్రత్యేక పూజలు చేశారు.

క్రికెట్ కిట్ల అందజేత

కాల్వశ్రీరాంపూర్ , ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఉన్నత పాఠశాల విద్యార్థులకు కాంగ్రెస్ నాయకులు గురువారం క్రికెట్ కిట్లు అందజేశారు. ఎమ్మెల్యే విజయరమణారావు వేసవి కాలంలో విద్యార్థులకు ఆటల పై దృష్టి సారించా లన్న ఉద్దేశ్యంతో క్రికెట్ కిట్లు అందజేయగా కాంగ్రెస్ నాయకులు వీటిని విద్యార్థులకు అందజేశారు.

విద్యుత్‌షాక్‌తో గేదె మృతి

మంథనిరూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని గాజులపల్లి గ్రామానికి చెందిన మామిడి రాజే శం అనే వ్యక్తి చెందిన గేదె గురువారం విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. మేత కోసం చెరువు వద్దకు వెళ్తగా విద్యుత్ స్తంభానికి ఉన్న వైర్ తగలడంతో షాక్‌తో అక్క డిక్కడే మృతి చెందింది. విలువ సుమారు రూ. లక్ష ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

సమ్మెను విజయవంతం చేయాలి

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాల సవరణను వ్యతిరేకిస్తూ ఈనెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గురువారం ఇఫ్టూ కార్యాలయంలో సమావేశం జరిగింది. కార్మిక చట్టాలను సవరించడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు నాయకులు పేర్కొన్నారు. చందర్, సునీల్, ముత్యంరావు, నరేష్, వైకుంఠం, విశ్వనాథ్, శ్రీనివాస్, ప్రకాష్, పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక వారోత్సవాల సంద ర్భంగా గురువారం గోదావరిఖని మార్కండేయకాలనీలోని ఒక ప్రైవేట్ ఆసు పత్రిలో వైద్య సిబ్బందికి ఫైర్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు రోగులను ఎలా బయటకు తీసుకురావాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య సిబ్బందికి వివరించారు. రమేష్, చందర్, రాజు, మనోహర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మంథని, (ఆంధ్రజ్యోతి): మంథని ఫైర్ ఆఫీసర్ శివశంకరవరప్రసాద్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి, మాతా శిశు సంరక్షణ కేంద్రం, రెనే ఆసుపత్రిలో అవగాహన కల్పించారు. ఆసుపత్రుల ప్రాంగణంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలిపారు. ఫైర్ సిబ్బంది మేడ దేవేందర్, నరేందర్, ప్రశాంత్ రమేష్, నాగరాజులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ మహాసభలను జయప్రదం చేయండి

పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర 5వ మహా సభలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి జిల్లాల ప్రశాంత్ పేర్కొన్నారు. మహాసభల పోస్టర్లను గురువారం జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మహాసభలు ఈనెల 25, 26, 27తేదీల్లో ఖమ్మం జిల్లాలో జరుగుతున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ 8వేలకోట్ల రూపాయలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా రన్నారు. జిల్లా కమిటీ సభ్యులు రాజు, మణిరత్నం, అబిరామ్, నాయకులు హరీష్, వినయ్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేపల్లికి నివాళులర్పించిన బీఆర్‌ఎస్ శ్రేణులు

మంథని, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్థంతి సందర్భంగా స్థానిక జెడ్పీహెచ్ఎస్ గర్ల్స్ స్కూల్ సమీపంలోని సర్వేపల్లి విగ్రహం వద్ద బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు గురువారం నివాళులర్పించారు. దేశానికి సర్వేపల్లి చేసిన సేవలను కొనియాడారు. శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్, ఎక్కేటి అనంతరెడ్డి, బెల్లంకొండ ప్రకాష్‌రెడ్డి, దేవళ్ళ విజయ్‌కుమార్, సత్యనారాయణగౌడ్, లక్ష్మయ్యలు పాల్గొన్నారు.

చైతన్య జ్యోతి జిల్లా సమాఖ్య పాలకవర్గం


కలెక్టర్‌కు పూల మొక్క అందజేస్తున్న పాలకవర్గ సభ్యులు

పెద్దపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): చైతన్యజ్యోతి జిల్లా సమాఖ్య పాలకవర్గం నియామకం పూర్తయ్యిందని డీఆర్‌డీఓ, ఎన్నికల అధికారి ఎం కాళిందిని ప్రకటించారు. గురువారం కలెక్టరేట్‌లో ఈ ఎన్నికలు జరిగాయని, ఈ ఎన్నికలకు జిల్లా సహకార అధికారి కార్యాలయ సిబ్బంది అనూష పర్యవేక్షకులుగా వ్యవహరించారని తెలిపారు. జిల్లా సమాఖ్య పాలక వర్గం సభ్యుల నుంచి అధ్యక్షురాలిగా పాలకుర్తి మండలానికి చెందిన ఎస్ స్నేహ, కార్యదర్శిగా ముత్తారం మండలానికి చెందిన జే శోభ, కోశాధికారిగా పెద్దపల్లి మండలానికి చెందిన జి స్వప్న నియమితులయ్యారని పేర్కొన్నారు. అనంతరం ఎన్నికైన పాలకవర్గాన్ని కలెక్టర్ కోయ శ్రీహర్ష అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి జె రవి కుమార్, డీపీఎం కె రవి, జిల్లా సమాఖ్య సిబ్బంది అన్ని మండల సమాఖ్య అధ్యక్షులు పాల్గొన్నారు

ఎలిగేడు మండల డీటీఎఫ్ కార్యవర్గం


వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేష్‌కుమార్

ఎలిగేడు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఎలిగేడు మండల డీటీ ఎఫ్ కార్యవర్గంను జిల్లా డీటీఎఫ్ ప్రధా న కార్యదర్శి అప్పిడి సంతోష్‌రెడ్డి తెలిపారు. అధ్యక్షుడిగా పులి వెం కటేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నగునూరి రాజేష్ కుమార్, ఉపా ధ్యక్షులుగా ఎ.రాములు, జి.శ్రీవాణి, వెంకటేశ్వర్లు, కార్యద ర్శులుగా బి.శ్రీధ ర్, డి.రామ్మోహన్, ఎ.వెంకటేశ్వర్లులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. అధ్యక్ష, కార్యద ర్శులు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఐదు డిఎలను విడుదల చేయాలని, పీఆర్‌సీని అమలు చేసి విద్యారంగంపై ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని డిమాండ్ చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

సుల్తానాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): గర్రెపల్లి గ్రామానికి చెందిన సంకరి అంజయ్య (49) అనే వ్యక్తి ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అంజయ్యకు భార్య ఇద్దరు కూతుళ్లు ఒక కుమారుడు ఉన్నారు. కూతురు వివాహానికి, ఇతర అవసరాలకు అప్పులు చేశాడు. తీర్చలేని పరిస్థితి ఏర్పడడంతో గురువారం మధ్యాహ్నం శివారులో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య అంజమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రావణ్ కుమార్ తెలిపారు.

ఆహ్లాదంగా బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్


ఠాణాకు వెళ్ళే రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లు, చెట్ల కింద సేద తీరుతున్న ఫిర్యాదుదారులు

పాలకుర్తి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): బసం త్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఉద్యానవనాన్ని తలపి స్తోంది. ఠాణాకు వచ్చే ఫిర్యాదుదారులకు చల్లని నీరు, కూర్చునేందుకు సిమెంటు బెంచీలు, పచ్చని చెట్ల మధ్య అహ్లాదకరంగా ఉంటోంది. ఈ ఠాణా పరిధిలోకి ధర్మపురి అసెంబ్లీ నియో జకవర్గంలోని ముంజంపల్లి, ఉండెడ, మారే డుపల్లి, పెద్దపల్లి నియోజకవర్గంలోని భోంపల్లి, అప్ప న్నపేట, మంథని నియోజక వర్గంలోని సబ్బితం, రంగాపూర్ గ్రామాలు ఉన్నాయి. ప్రధాన రహదారిని ఆనుకొని ఠాణా ఉండడంతో ఈ మార్గం గుండా ప్రయాణించే ప్రజాప్రతిని ధులకు, జిల్లా ఉన్నతాధికారులకు భద్రత కల్పిం చాల్సి ఉంటుంది. రోజు వాహన తనిఖీలు, సైబర్ నేరాలపై ప్రజలకు, విద్యార్థులకు అవగా హన కల్పించడంతోపాటు గ్రామాల్లో సీసీ కెమె రాల ఆవశ్యకతను వివరిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నారు.

సిబ్బంది సహకారంతో : ఎస్ఐ స్వామి



ఠాణా ఆవరణలో పలు రకాల పూలు, పం డ్లు, నీడనిచ్చె చెట్లను పెంచుతున్నాం. కొందరు దాతల సహకారంతో సిమెంటు బెంచీలు ఏర్పాటు చేశాం. కుటుంబ సభ్యుల మధ్య పరిష్కారం చేసుకునే చిన్నపాటి సమస్యలపై కూడా ఠాణాకు వస్తున్నారని, సాధ్యమైనంత మేరకు రాజీ మార్గమే రాజమార్గమని భావించి కౌన్సెలింగ్ ద్వారా సమస్యలను పరిష్కరిస్తున్నాం. యువత మద్యం, గంజాయికి బానిస కాకుండా అవగాహన కల్పిస్తున్నాం.

ఓసీపీ-2 అధికారి పై దాడి


దాడిలో గాయపడిన సింగరేణి అధికారి

రామగిరి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసిపి-2 అడిషనల్ మేనేజర్ కొల శ్రీనివాస్‌పై కొందరు గురు వారం దాడికి పాల్పడ్డారు. ఓసిపి-2 విస్తరణలో భాగంగా మండలంలోని బుధవారం పేట్‌లోని 88 ఎకరాల భూమిని అధికారులు సర్వే నిర్వహిస్తుండగా భూమికి సంబంధించి వ్యక్తులు కాకుండా ఇతర వ్యక్తులు అడ్డుకొని సర్వే పరికరాలు ధ్వంసం చేశారు. ఆ సమయంలో అడ్డుగా వెళ్ళిన శ్రీనివాస్ పై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో గాయపడిన శ్రీనివాస్‌ను డిస్పెన్సరీకి తర లించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం ఏరియా ఆసుప త్రికి తరలించారు. గాయపడిన అధికారిని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు పరామర్శించారు.

మృతుడి కుటుంబానికి చెక్కుల అందజేత

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): జీడీకే 7ఎల్ఈపీలో ప్రమాదవశాత్తు మృతి చెందిన తీట్ల సత్యనారాయణ కుటుంబానికి ఆర్థిక ప్రయోజనాల చెక్కును గురువారం జీఎం బండి వెంటకయ్య అందజేశారు. హెడ్ ఓవర్‌మెన్‌గా పని చేస్తున్న సత్యనారాయణ విధి నిర్వహణలో ఇసుక బంకర్‌లో పడి మరణించాడు. ఆయన కుటుంబానికి రావాల్సిన మ్యాచింగ్ గ్రాంట్‌తోపాటు ఉద్యోగుల కంట్రిబ్యూషన్ రూ.20,46,892 లక్షల చెక్కును జీఎం సత్యనారాయణ సతీమణికి అందజేశారు. ఏఐటీయూసీ బ్రాంచి సెక్రె టరీ జిగురు రవీందర్, ఎస్వోటూ జీఎం రాముడు, ఏరియా అధికార ప్రతి నిధి అనిల్‌కుమార్, డీవైపీఎం శ్యాంప్రసాద్ అధికారులు పాల్గొన్నారు.

సింగరేణి సమాచారం

ఆర్‌జీ-1 సీఎస్‌పీ పిట్ సెక్రటరీగా పుప్పాల రవీందర్


పిట్ కమిటీని హెచ్ఓడీకి పరిచయం చేస్తున్న వడ్డేపల్లి శంకర్

గోదావరిఖని, ఏప్రిల్ 17(ఆన్‌లైన్): టీబీజీకేఎస్ ఆర్‌జీ-1 సీఎస్‌పీ పిట్ సెక్రటరీగా పుప్పాల రవీందర్‌ను నియమించినట్టు టీబీజీకేఎస్ ఆర్‌జీ-1 ఉపాధ్యక్షుడు వడ్డేపల్లి శంకర్ చెప్పారు. గురువారం ఎన్నికైన పిట్ కమిటీని సీఎస్‌పీ ఇన్‌చార్జి హెచ్‌ఓడీ హరీష్‌కు పరిచయం చేయించారు. ఉపాధ్య క్షుడు శంకర్ మాట్లాడుతూ పదేళ్లుగా కార్మికుల హక్కుల కోసం పోరాటం చేసింది టీబీజీకేఎస్ అని, అనేక హక్కులను, సమస్యలను పరిష్కరించా మన్నారు. చెల్పూరి సతీష్, పొలాడి శ్రీనివాసరావు, శేషగిరి, మీస రాజు, తిరుపతి, వాసర్ల జోసఫ్, జనగామ మల్లేష్, శ్రావణ్, రాజు, నరేష్, శ్రీనివాస్‌రెడ్డి, విక్రమ్, సాదిక్ అలీ, తిరుపతి, కిరణ్ పాల్గొన్నారు.